తీవ్రవాది

ఎమ్. వి. వి. సత్యనారాయణ

మాధవి టెన్నిస్ రాకెట్ వూపుతూ కోర్టులోంచి యివతలకు వచ్చింది. అప్పటికే గోపాలరావుగారు కారులో కూర్చున్నారు.

మాధవి వెనుక సీటులోకి రాకెట్ గిరవాటు పెట్టి ఆయన ప్రక్కన వచ్చి కూర్చుంది. కారు బయలుదేరింది.

"సాయంత్రం వార్తలు వినలేదు కదా నువ్వు?" అడిగాడు గోపాలరావు.

"లేదు నాన్నగారూ! ఏం చెప్పారు?"

"అమెరికాలో టెక్సాస్ రాష్ట్రంలో గూఢచారిచర్యలు జరుపుతోన్న విదేశీ ముఠా ఒకటి వున్నట్టు తెలిసిందని అధ్యక్షుడు ఆరోపించారట. ఆ ముఠాలో ఒకరిద్దరు భారతీయులు కూడా వున్నట్టు ఆయన అనుమానం వ్యక్తం చేశారు."

"చేస్తే....ఏమిటిది?"

"మన మూర్తి టెక్సాస్ రాష్ట్రంలో కనిపించినట్టు

యిటీవల జానీ రాయలేదా?"

మాధవి ముఖంలో మార్పులు వచ్చాయి. మూర్తి ప్రసక్తి రావడమే అందుకు కారణం. మాధవి సుతారంగా ముఖానికి పట్టిన చెమటలు తుడుచుకుంది.

"జానీ అంటే మీ అమెరికన్ స్నేహితుడు కదా!"

"అవునమ్మా! ఎంతమందికి రాయాలో అంతమందికీ మూర్తి గురించి రాశాను. జానీ సంయుక్త రాష్ట్రాలు తిరుగుతుంటాడు. అతడికి టెక్సాస్ రాష్ట్రంలో మూర్తి కనిపించాడంటే ఈ ముఠాలో వున్నాడేమోనని నా అనుమానం."

మాధవి నిట్టూర్చింది. మూర్తి మొదటనుండి టెర్రరిస్టు భావాలున్న వ్యక్తి. అమెరికామీదా, అమెరికా అయుధ సంపత్తి సేకరణపట్లా అంతులేని కోపం పెంచుకున్న వ్యక్తి. తనతో పెళ్ళయిన ఆరునెలలకే మూర్తి మాయమయ్యాడు. మూర్తికి వెనకా ముందూ యెవరూ లేరు. బాగా చదువుకున్నవాడనీ, గొప్ప చురుకుదనం వున్న వ్యక్తి అనీ గోపాలరావుగారు తనకు అతడితో ఆదర్శ వివాహం జరిపించారు. ఇల్లరికం తెచ్చుకున్నారు.

వెళ్ళిపోయే ముందు రాత్రి మూర్తి చేతిలో అమెరికా గురించిన హాండ్‌బుక్ చూచింది మాధవి.

"కొంపతీసి అమెరికా వెళ్తారా?...." అంది ఛలోక్తిగా.

"ఏం? వెళ్ళకూడదా?" అన్నాడు మూర్తి.

"అమెరికా అన్నా, అమెరికన్ సామ్రాజ్యవాద మన్నా మీకు కోపం కదా, అక్కడికి వెళ్ళి ఏం చేసుకు వస్తారు?"

"అక్కడి పరిస్థితులను గమనిస్తాను. అల్లకల్లోలం సృష్టి

స్తాను. నాకు సాధ్యపడినంతగా మార్చిపారేస్తాను."

మాధవి భయపడింది. మూర్తి చేతలమనిషి! మాటల మనిషి కాడు. అతడు నిజంగా విదేశం వెళ్ళిపోతాడా? తన బతుకుతో ముడిపడివుంది. అతడు విదేశం వెళ్ళి అక్కడి పరిస్థితులమీద తిరగబడటం యేమిటి? మన దేశం లేదా? యిక్కడ అంతకంటె దుర్భరమైన పరిస్థితులు లేవా? ఆ మాత్రం సంస్కరణ భావాలున్నవాడు మాతృదేశాన్ని బాగు చేసుకోవచ్చునుకదా!

అయినా మూర్తి ఒకడివల్ల ఏమవుతుంది?

మాధవి ఆ రాత్రంతా నిద్రపోలేదనుకుంది. ఎప్పుడు కన్ను మూసి ఆదమరపుగా వుందో అప్పుడు మూర్తి మాయమయ్యాడు. ఎటు వెళ్ళి ఏమయ్యాడో తెలియరాలేదు. ఇంట్లో మేనత్త వుంది. మేనబావ వున్నాడు. పనిమనిషి వున్నాడు. వంటమనిషి వుంది. అయిప్పటికీ మూర్తి ఎవరి కంట్లోనూ పడకుండా వెళ్ళిపోగలిగాడు.

మూర్తికి యింకా అనుచర వర్గముందా?

"మూర్తిని వెనక్కి రప్పించే శక్తి మనలో లేదు" గోపాలరావుగారి గొంతు బొంగురుపోయింది. కంటి తడి కూతురుకు కనిపించకుండా జాగ్రత్తపడ్డాడు. అయినా మాధవి కనిపెట్టగలిగింది.

తండ్రి భుజం తట్టి "నాన్నగారూ!" అంది.

గోపాలరావుగారు నిభాయించుకోలేక పోయారు. రోడ్డు వారగా కారు ఆపారు. తండ్రీ కూతుళ్ళు బొట బొట కన్నీళ్ళు కారుస్తున్నారు.

దారిన యెవరు వెళ్తోంది వాళ్ళకు తెలియడంలేదు.

కారు తలుపువద్ద ఒక నడివయస్కురాలు ఆగింది. కొన్ని నిమిషాలు పాటు యిద్దరినీ పరకాయించి

చూచింది.

"అన్నయ్యా!" అంది చివరకు.

గోపాలరావుగారు తెలివిలోకి వచ్చారు. తల తిప్పారు. అనసూయ!

"ఏమమ్మా! నువు....యిటు...." రోడ్డుమీదకు చూశారు. ఆటో వుంది.

"అన్నయ్యా, పనిమీద బయలుదేరాను. కారును నువ్వో, కోడలూ టెన్నిస్ క్లబ్బుకు తీసుకువెళ్ళినట్టు పని వాడు చెప్పాడు" అంది అనసూయ.

"పద....ఎక్కడ దింపాలి?" అడిగాడు గోపాల రావుగారు.

"ఫరవాలేదన్నయ్యా! మీరు యింటికి పదండి!" అన సూయ వెళ్ళిపోయింది.

గోపాలరావుగారు కళ్ళు తుడుచుకుని మాధవిని సముదాయించారు. కారు తిరిగి ప్రయాణం మొదలు పెట్టింది.

"నాన్నగారూ! ఆటోలో అత్తయ్య ప్రక్క ఎవరో మగతను కూర్చున్నట్టున్నారు" అంది మాధవి.

గోపాలరావుగారు విడ్డూరంగా చూచి, "ఎవరు? నువ్వు పొరబడి వుంటావమ్మా!" అన్నాడు.

"వెనుక సీట్లో యెవరో కూర్చున్నారు. పంచె కట్టు కున్నాడు. అందుకే అత్తయ్య తిరిగి ఆటోలో వెళ్ళి పోయింది. లేకపోతే కారు వదిలిపెట్టి వెళ్ళదు. అతడి జోళ్ళు కూడా కనిపించాయి."

గోపాలరావు తలూపి, "కావచ్చును. కావాలని మనని పలకరించి మనని యిటు మాచేలాగా చేస్తుందా?" అన్నాడు.

"ఆటో మనకు ఎదురుగా వచ్చింది. మనం చూశామో, లేదో నిర్ధారణ చేసుకోవడానికి పలకరించింది."

"అంతే అయుండాలి. అతడెవరై వుంటాడు?"

"ఏమో, ఆటోను వెంటాడదామా?"

"ఈ కారులోనా, వద్దమ్మా!" కారు మలుపుతిరిగి అప్‌లాండ్స్‌లో పరుగెత్తుతోంది.

2

"అమ్మా!" అన్నాడు రమేష్.

అనసూయ ఏమిటన్నట్టు చూచింది.

"మా స్నేహితుడి పెళ్ళికి వెళుతున్నాను. రెండువంద లుంటే యివ్వు."

"ఏమిట్రా! నీ ఖర్చు డబ్బు వందలు వందలుగా ఎక్కడినుండి రాలుతాయి."

"మామయ్య నడిగి తీసుకో! మనకి మాత్రం ఎవరు న్నారు?"

అనసూయ చెక్కిళ్ళు నొక్కుకుంది. "హవ్వ...వందకీ రెండువందలకీ చెయ్యి జాపితే పరువుగా వుంటుందా?" అంది.

రమేష్ వెటకారంగా నవ్వి, "మనం ఇంట్లోపడి తింటున్నాం. అప్పుడు పరువు వుండగా లేనిది చెయ్యి జాపితే పరువు పోతుందా, విచిత్రంగా మాట్లాడతా వమ్మా!" అన్నాడు.

అనసూయ నొచ్చుకున్నట్టు చూచి, "నా బాధ నీకు వెటకారంగా వుంటుందిలే, రమేష్! నువు మాధవిని పెళ్ళిచేసుకోవా? అప్పుడు ఈ ఆస్తి అంతా నీదేకదా! ఇప్పుడు వందలకు కక్కుర్తి పడతావా?" అంది.

"ఏమిటీ మాధవిని పెళ్ళిచేసుకోవడమా?"

"మరేమిటి? దానితో కలసి టెన్నిస్ ఆడటం ఒక్కటే అనుకుంటున్నావా? వెర్రి సన్నాసి! నువ్వొక వున్న యింటి వాడివయితే ఎంత బాగుంటుందిరా!"

"మాధవి మొగుడు అమెరికానుండి రాడనుకుంటున్నావా?"

"వాడి మొహం! వాడికి పెళ్ళి ఎందుకు?"

"అయినా యిదేం ఆలోచనే! రెండో పెళ్ళి దాన్ని చేస్తావా నాకు?"

"ఏం! మాధవికేం లోపంరా?"

"అదేమిటమ్మా, కొంతకాలం సంసారం చేసింది. భర్త యింకా బతికే వున్నాడు. మాధవిని తప్ప మరో అయినింటి పిల్లను చూడలేవా?"

"వెర్రివాడా? నీకేం వుందని ఆడపిల్లలు ఎగబడి వస్తార్రా?"

"అందుకని ...."

"నేను చెప్పినట్టు చెయ్యి. మాధవిని బుట్టలో వేసుకో. అసలే వయసుమీద వుంది. భర్త తిరిగి వస్తాడన్న నమ్మకం ఆమెకు లేదు."

"నీతో ఆ సంగతి చెప్పిందా?"

"పిచ్చిసన్నాసీ! ఆడపిల్ల అంత చప్పున బయటపడి పోతుందా?"

రమేష్ చిరాకుగా చూచి, "తాజా హీరోయిన్‌ని వెంబడించినట్టు ఆమె ప్రేమకోసం వెంపర్లాడమంటావ్, అంతేనా?" అన్నాడు.

"అంతే! అంతే!"

పార్టీ కోలో కారాగింది. అనసూయ చప్పున నోటి మీద వ్రేలుంచుకుంది.

"మామయ్యకు తెలుస్తేనో...." గుసగుసలాడాడు కొడుకు.

"పరమానంద పడతాడు. కూతురి బ్రతుకు అడవి కాచిన వెన్నెల అయిపోయిందని అన్నయ్య మథనపడు తున్నాడు."

మాధవి స్లిప్పర్స్ టకటకలాడించుకుంటూ నడవ లోంచి వెళ్తోంది. తల్లీ కొడుకులు గదిలోంచి ఆమెవైపు చూశారు. ఆమెను గది దాటనిచ్చి తల్లి అంది.

"ఒక్కతే వచ్చినట్టుంది కారులో. యెక్కడికి వెళ్ళిందో?"

"స్నేహితురాలికెవరికో యాక్సిడెంటయిందట. చూడ టానికి వెళ్ళింది."

"నీకు చెప్పిందా?" సంబరపడింది అనసూయ.

"మామయ్య కారు గురించి అడుగుతాడని పనివాడితో చెప్పింది."

"సరేలే.... రేపటినుండి అది నీ వలలో పడిందా లే నీకే చెప్పి వెళ్తుంది."

"కలలు కనక! డబ్బు యివ్వమ్మా, వెళ్ళిరావాలి!"

అనసూయ రుసరుసలాడింది. "నువ్వు మాధవితో మాట్లాడిరా! నేను ఈ లోపులో సిద్ధం చేసి వుంచుతాను" అంది.

రమేష్ చిరాకుగా బయటకు కదిలాడు. అడుగులో అడుగు వేసుకుంటూ మాధవి గదిముందాగాడు.

మాధవి పడక కుర్చీలో కూర్చుంది. పేపర్ తిరగ వేస్తోంది.

"రా రమేష్!" అంది.

రమేష్ తటపటాయించి ఆమెకు ఎదురుగా సోఫాలో

చూస్తున్నాడు.

"ఏమిటి రమేష్, పనిమీద వచ్చావా!"

"అబ్బే...."

"చెప్పు....డబ్బు కావాలా?"

"డబ్బుకాదు మాధవీ!"

"వూ! మరేమిటి?"

"నిన్ను ఒకటడగాలి."

"వూఁ!"

రమేష్ గుటక వేసి, "మనం కలసి సినిమాకు వెళ్దాం" అన్నాడు.

"ఓస్ ... ఇంతేనా? ఏమిటో విశేషం?"

"ఏమీ లేదు. నాకలా అనిపించింది అంతే!"

"తప్పకుండా."

రమేష్ గుటక వేసి, "రేపు" అన్నాడు.

మాధవి నవ్వి, "అలాగే. నువ్వు ఆడపిల్లలాగా ముడుచుకుపోతుంటే ఎంత ముచ్చటగావుందో తెలుసా?" అంది.

రమేష్ యింకా గిరికీలు తిరిగాడు.

"థాంక్స్....సినిమాకి వస్తానన్నందుకు" అన్నాడు.

పదినిమిషాలపాటు అవాకులు చవాకులు మాట్లాడి వెనక్కి తిరిగాడు. తల్లి అక్కడికి గుమ్మంవద్ద దాగివుండి కనిపించింది. ఆమె కళ్ళలో వింత వెలుగు కనిపిస్తోంది.

రమేష్ చేతిలో రెండు వందరూపాయినోట్లు పెట్టింది.

మెట్లమీద చప్పుడయింది. గోపాలరావుగారు మెట్లెక్కుతున్నారు. తల్లి కొడుకులు గదిలోకి తప్పుకున్నారు.

గోపాలరావుగారి మొహం నల్లబడిపోయి వుంది.

మాధవి గదిలోకి నడిచారు.

"నాన్నగారూ!" అంది మాధవి దిగ్గున లేచి.

"వాడు ..యెంతమాటన్నాడో చూడు మాధవీ!" ఆవేశంతో అన్నారాయన.

మాధవి తండ్రి ఛాతీ చేతితో నిమిరి, "తొందర పడకండి నాన్నగారూ! కూర్చోండి...." అంటూ కూర్చుండబెట్టింది. కూజాలోంచి మంచి నీళ్ళందుకుని త్రాగింపచేసింది.

గోపాలరావుగారు స్థిమితపడ్డారు. పది నిముషాలు గడిచాయి.

"భీమరాజు నీకు తెలుసుగదా తల్లీ!....వాడు నా కళ్ళముందు నిక్కర్ లేకుండా తిరిగిన వెధవ....యెంత మాటన్నాడో తెలుసా?"

"ఎక్కడ? పేకాటలోనా?"

ఆయన తలూపారు.

"అతడితో మీకు ఆట ఏమిటి?"

"వాడు ఎవరితోనో కలసి ఆడుతున్నాడు. మనం ఎవరం—అభ్యంతర పెట్టడానికి?"

"...... ...."

"అమెరికా వెళ్ళిన అల్లుడు యిక తిరిగిరాడు. తన లాంటి మరో యోగ్యుడిని చూచి అమ్మాయికి పెళ్ళిచేస్తే బాగుంటుందని వాడు....సలహా యిస్తాడా?"

ఈసారి మాధవి మొహం నల్లబడింది. తల దించుకుంది.

"అందుకే వాడిని చడామడా తిట్టేశాను నలుగురూ పట్టేసుకున్నారు. లేకపోతే నరికి పోగులు పెట్టేవాడి నే!"

మాధవి ఏడుస్తోంది. తండ్రి గుండెలమీద తలవాల్చి

నిస్సహాయంగా ఏడుస్తోంది. వాళ్ళిద్దరికీ తెలియదు, తమను కిటికీలోంచి నాలుగు కళ్ళు చూస్తున్నాయనీ, ఆ కళ్ళలో సంతోషం వెల్లివిరుస్తోందనీనూ.

3

డిటెక్టివ్ శిరీష్ ఇద్దరివైపూ పరిశీలనగా చూచి, మరోసారి తన చేతిలోని విజిటింగ్ కార్డువంక చూశాడు.

గోపాలరావు, మేనేజింగ్ డైరెక్టర్, మాధవీ పల్ప్ రైజింగ్ మిల్స్, విశాఖపట్నం-19 అని వుంది కార్డులో.

"ఈమె మా అమ్మాయి మాధవి. మిల్స్ అమ్మాయి పేరనే వున్నాయి, మిస్టర్ శిరీష్" అన్నారు గోపాలరావుగారు.

శిరీష్ తలూపాడు. అప్పుడే మాధవి చేతులు జోడించింది.

శిరీష్ ఆమెను తిరిగి విష్ చేసి, "చెప్పండి గోపాలరావుగారూ! మీరు వచ్చిన పనేమిటి?" అన్నాడు.

గోపాలరావుగారు మెల్లగా దగ్గి, "మీకు దాపరికం లేకుండా అంతా చెబుతాను. దయచేసి నా అల్లుడిని అమెరికానుండి తిరిగి యిక్కడికి తీసుకురండి. ప్లీజ్" అన్నాడు.

"ఆయన పేరు?"

"మూర్తి."

"అమెరికా పౌరసత్వం తీసుకున్నారా?"

"లేదు. అమెరికాలో అతడు వుండటం ఆ దేశ ప్రభుత్వానికి కంటగింపుగా వుంటుంది. అతడు తీవ్రవాది. ప్రభుత్వం దృష్టిలోంచి తప్పించుకు తిరుగుతున్నాడు. అతడిని ఇండియా చేర్చాలి మిస్టర్ శిరీష్."

శిరీష్ రెండు నిమిషాలపాటు మాట్లాడలేదు.

"గోపాలరావుగారూ! మూర్తి అమెరికా వెళ్ళి ఎంత కాలమయి వుంటుందీ?"

"పోయిన సంవత్సరం ఆగస్టు 5న. ఏడాది దాటుతోంది."

"సంయుక్త రాష్ట్రాలలో తీవ్రవాద చర్యలతో పాల్గొన్నారా మూర్తిగారు?"

"అలా అనే అర్థమయింది. మొన్న అమెరికా అధ్యక్షుడు తీవ్రవాద కార్యకలాపాలు గురించి ప్రకటన చేశారు. ముఠాలో ఒకరిద్దరు భారతీయులున్నట్టు ఆయన అభిప్రాయపడ్డారు. ఒకరిద్దరిలో మా మూర్తి తప్పక వుండివుంటాడు" గోపాలరావుగారి గొంతు గద్గదమయింది.

"గోపాలరావుగారూ! మూర్తిగారిని ఇండియా తీసుకురావడం అంత సులువయిన పనికాదు. మొదటిది మూర్తిగారికి భారతదేశం తిరిగిరావాలని వుండాలి. తీవ్రవాద కార్యకలాపాలు జరపడానికి మూర్తిగారు తనకు తానే అమెరికా వెళ్ళారు. ఆయన ఎదురయ్యే ప్రమాదాలకు తలొగ్గే వెళ్ళారనుకుందాం. ప్రస్తుతం ఆయన తాను ప్రమాదాలకు తట్టుకోలేని మానసిక స్థితిలో వుంటే తప్ప మనదేశం తిరిగిరారు. అవునా?"

"అవును. అది పెద్ద ఇబ్బంది!"

"తరువాత మూర్తిగారు కలసి పనిచేస్తున్న ముఠా ఆయనను అంత సులువుగా వదులుకోదు. తమ నిర్ణయాలకు కట్టుబడి పనిచెయ్యకపోతే మనిషిని శాశ్వతంగా పోగొట్టుకుంటుంది ముఠా. అంటే నా ఉద్దేశ్యం మీకు అర్థమయిందనుకుంటాను."

మాధవి కళ్ళు తడిశాయి.

"మూడోది.... అక్కడి ప్రభుత్వం మూర్తిగారిమీద నిఘా వేసి వుంటుంది. రేడియోలో మీరు విన్న వార్త ప్రకారం అయితే 'కనిపిస్తే కాల్చివేత!' వంటి ఉత్వరు చేసివున్నా ఆశ్చర్యంలేదు."

"మీ అనుమానం నిజం కావచ్చును. కాని అమెరికా మనకు మిత్రదేశం. రాజకీయ ఖైదీ విషయంలో కనీసం పట్టుకున్నట్టయినా తెలియపరుస్తారనుకుంటాను."

శిరీష్ భుజాలు చనుచుకుని, "అలా అయితే మంచిదే! ఆటు తర్వాత క్షమాభిక్షకోసం ప్రయత్నించవచ్చును" అన్నాడు.

గోపాలరావు ఆశగా చూచి, "మిస్టర్ శిరీష్! మీరు వెళ్ళడానికి ఒప్పుకున్నట్లే కదా! ప్లీజ్.... అవుననండి..." అన్నాడు.

"ఎప్పుడు బయలుదేరాలి?" బల్లమీది కాలెండర్ చూశాడు శిరీష్.

"మీ ఇష్టం. ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా వీసా, పాస్‌పోర్టు, ఎయిర్ టికట్‌లకోసం నేను ప్రయత్నిస్తాను. మీకు ఖర్చులుపోను అయిదులక్షల రూపాయిలు ఫీజు యిస్తాను. అంతకంటె యెక్కువ కావాలంటే నిర్మొహమాటంగా మీరు తీసుకోవచ్చును."

శిరీష్ చాలునన్నట్టు చూచి, "రెండు రోజులలో ఏర్పాటు చేయించండి డబ్బు. రెండులక్షలు అడ్వాన్స్‌గా కూడా!" అన్నాడు.

"తప్పకుండా మిస్టర్ శిరీష్! మాధవికోసం మా మేనల్లుడు రమేష్, నా పేకాట ఫ్రెండ్ భీమరాజు కలలు కంటున్నారు. మూర్తి యిక రాడనీ, రెండో పెళ్ళి చేయమనీ నా చెల్లెలు అంటే రమేష్ తల్లి శతపోరు

తోంది. మీరు మూర్తిని తీసుకురావాలి. వీళ్ళందరి నోళ్ళూ మూతపడిపోవాలి" అన్నాడు గోపాలరావు ఆవేదనగా.

4

భీమరాజు టాక్సీ దిగాడు. గేటు తెరచుకుని ఇంట్లోకి నడిచాడు. గోపాలరావుగారు మెయిన్ హాలులోనే కనిపించారు.

"గోపాలరావుగారూ! మీతో మాట్లాడాలని వచ్చాను" అన్నాడు భీమరాజు.

గోపాలరావుగారిలో అసహ్యం ఉవ్వెత్తున లేచింది. సభ్యతకోసం లోపల్లోపలే అణచుకున్నాడు. భీమరాజుకు సీటు చూపించి, "నాతో నా?" అన్నాడు.

భీమరాజు కూర్చున్నాడు. "అవును. గోపాలరావుగారూ! నా ప్రవర్తనకు మన్నించమని కోరడానికి వచ్చాను."

"దట్సాల్ రైట్!"

"అలాకాదు. మాధవి మీకెంత ఆత్మీయురాలో రా నాకూ అంతే! ఆమె శ్రేయస్సే నేను కోరేది. ఆమాట చెప్పబోయి నాలుక తిరగబడింది."

"ఫరవాలేదు. మీరు బాధపడకండి!"

"మీ అల్లుడుగారిని విదేశం నుండి రప్పించుతున్నారా?"

గోపాలరావుగారు బలవంతంమీద మాట అపుకున్నారు. "ఆ ప్రయత్నం చేయాలి! ఇప్పటికే ఆలస్యమయిపోయింది కదా!" అన్నారు.

మెట్లమీద చప్పుడయింది. భీమరాజు అటు చూచి నవ్వాడు. రమేష్ కూడా పలకరింపుగా నవ్వి మెట్లు దిగ

బోయాడు.

"రమేష్!" అంది అనసూయ.

రమేష్ వెనక్కి తిరగకుండానే, "ఏమిటమ్మా!" అన్నాడు.

"ఒక్కసారి రా."

"రమేష్ వెనక్కి తిరిగి వెళ్ళాడు.

"మీ మేనల్లుడు ఏం చేస్తున్నాడు?" అడిగాడు భీమరాజు.

"పల్వరైజింగ్ మిల్సులోనే...."

తండ్రి మాట ముగియకముందే మాధవి కాఫీలతో వచ్చింది. భీమరాజు తలవాల్చుకున్నాడు. మాధవి కాఫీ అందించి వెళ్ళిపోయింది.

భీమరాజు లేచాడు. "గోపాలరావుగారూ! సెలవిప్పించండి!" అన్నాడు.

గోపాలరావుగారు అతడిని గుమ్మందాకా సాగనంపారు. ఆయన తిరిగివచ్చేటప్పటికి మాధవి మెట్లకిందే నిలబడి భీమరాజు వెళ్ళినవైపే చూస్తోంది.

"నాన్నగారూ! ఈయనెవరు?" అడిగింది మాధవి.

"కావాలనే నీకు పరిచయం చేయలేదమ్మా, భీమరాజు అంటే యితడే!"

"అదే పంచెకట్టూ, అవే జోళ్ళూ...."

"ఏమిటమ్మా?"

"అత్తయ్య ప్రక్క ఆ రోజు ఆటోలో చూసింది అదే పంచెకట్టూ, అవే జోళ్ళూ..."

"ఏమిటి నువ్వనేది?"

"అవును నాన్నగారూ! నిజమే! నా కళ్ళు నన్ను మోసం చెయ్యవ్."

గోపాలరావుగారు చటుక్కున ముందు కడుగువేసి పైకి చూశారు. అనసూయ కిందకే చూస్తోంది. అన్నగారిని చూడగానే తడబడింది. చూపు మరల్చుకుంది.

"బజారుకు వెళ్ళి రా, రమేష్!" అంది అనసూయ.

రమేష్ మెట్లు దిగి బయటకు వెళ్ళిపోయాడు. గోపాలరావుగారి మొహం తెల్లకాగితంలాగా అయింది. అసలు భీమరాజు యిలా యింటికి ఎందుకు వచ్చాడు? కేవలం క్షమాపణ చెప్పుకోడానికేనా? ఏమో....తనకు నమ్మకం కలగడంలేదు.

భీమరాజు తేనెపూసిన కత్తి. మాధవిమీద అతడి దృష్టి తప్పిపోయిందనటానికి లేదు. భీమరాజు మొండి మనిషని చెప్పుకుంటారు.

గోపాలరావుగారు ఊయ లూగినట్టు అటూ యిటూ వూగారు. ఒక దశలో చెల్లెల్నే అడిగి విషయం తేల్చుకోవాలనుకున్నారు. చెల్లెలు నిజం చెబుతుందని యేమిటి?

"ఈ సంగతి నీలోనే వుంచుకో మాధవి!" అని గోపాలరావుగారు బయటికి వెళ్ళిపోయారు.

5

ఎయిరిండియావారి బోయింగ్ విమానం అట్లాంటిక్ సముద్రజలాలమీద ఎగురుతోంది. దూరంగా విశాలమైన అమెరికా ఖండం జలాలకు అంచులో తేలుతోన్నట్టు కనిపిస్తోంది. ఎత్తయిన భవనాలు ఖండానికి వింత హుందాతనాన్నిస్తున్నాయి.

డిటెక్టివ్ శిరీష్ వాచీ చూసుకున్నాడు. సరిదిద్దుకున్న సమయం ప్రకారంగా ఉదయం పదిగంటల ముప్ఫయి నిమిషాలయింది. మరో అరగంటలో విమానం కాలి

ఫోర్నియా రాష్ట్రంమీద ఎగురుతోంది. మాడ్రిడ్ ఎయిర్ పోర్టులో విమానం దిగింది.

డిటెక్టివ్ శరీఫ్ విమానం దిగి అనవాయితీలు ముగించుకుని టాక్సీలో బయలుదేరాడు. పారగన్ హోటల్లో గది తీసుకుని బడలికతీర్చుకున్నాడు. తరువాత టాక్సీ కట్టించుకుని వాషింగ్‌టన్ వీధిలో 106-సి, అపార్ట్‌మెంట్ ముందాగాడు.

గేటుకు డబ్ల్యు. బి. జానీ అని బోర్డు వుంది.

కాలింగ్ బజ్జర్ నొక్కాడు శరీఫ్. తలుపు తెరుచుకుంది. ముసలావిడ ప్రత్యక్షమయింది. డ్రాయింగ్ రూంలోకి దారి చూపించింది.

“అబ్బాయి నిద్రపోతున్నాడు” అంది ముసలావిడ.

“ప్లీజ్! అతడిని నిద్ర లేపండి. నేను భారతదేశం నుండి వచ్చాను.”

ముసలావిడ లోపలకు వెళ్ళి రెండు నిమిషాలలో జానీను పంపించింది. పరస్పరం విష్ చేసుకున్నారు.

జానీకు నలభైఅయిదు సంవత్సరాలుంటాయి. బట్ట తల. ఎర్రగా నిగులముగ్గిన యాపిల్ పండు లాంటి శరీరం.

“మిమ్మల్ని గోపాలరావుగారు పంపించారా?” అడిగాడు జానీ.

శరీఫ్ తలూపాడు.

“పనిమీద వచ్చారా?”

“మూర్తిని భారతదేశం తీసుకువెళ్ళాలని వచ్చాను.”

జానీ భయంగా చూశాడు. చటుక్కున లేచి కిటికీలు తణిఖీ చేసి వచ్చాడు.

“మిమ్మల్ని యెవరూ వెంటాడలేదు కదా!” అన్నాడు.

శిరీష్‌కి అతడి ప్రవర్తన విచిత్రంగా తోచింది.

"లేదు" అన్నాడు.

"తీవ్రవాదుల విషయం ఎత్తితే చాలు ప్రభుత్వం జెయిలులో పెట్టాలని చూస్తోంది. మూర్తిని మనం మార్చలేము."

"తీవ్రవాదులు ఏమాత్రం సంఖ్యలో వుంటారు?"

"ప్రభుత్వం లెక్కల ప్రకారం నూటయాభైమంది!"

"అన్ని రాష్ట్రాలలోనూ వున్నారా? ఒక్క రాష్ట్రంలోనే వున్నారా?"

"వాళ్ళు ఎక్కడ ఏ రూపంలో వుంటారో చెప్పలేం. నన్నడిగితే మీరు మౌనంగా వెనక్కి తిరిగి వెళ్ళిపోతే మంచిదేమో!"

"మీ సలహాకి థాంక్స్."

"మూర్తి నాకు టెక్సాస్ రాష్ట్రంలో కనిపించాడు."

"మీతో మాట్లాడాడా?"

"లేదు. అతడు మారువేషంలో వెళ్తోంటే గుర్తుపట్టి పిలిచాను. పలకరించవద్దన్నట్టుగా కళ్ళు పెద్దవిచేసి చూచి, టాక్సీ కుదుర్చుకుని వెళ్ళిపోయాడు."

"టెక్సాస్ రాష్ట్రంలో ఏ నగరంలో అతడు మీకు కనిపించాడు?"

జానీ కొన్ని నిమిషాలపాటు ఆలోచించుకుంటూ వుండిపోయాడు. తర్వాత అన్నాడు "పిట్స్‌బర్గ్!"

"తీవ్రవాదుల కార్యకలాపాలు ముఖ్యంగా ఏ సమస్యలను కేంద్రీకరించి వున్నాయో చెప్పగలరా?"

"నాకు తెలియదు మిస్టర్ శిరీష్!"

"పిట్స్‌బర్గ్‌లో బొగ్గుగనులున్నాయి కదూ!"

"అవును. వున్నాయి."

"అక్కడి కార్మికుల సమస్యలమీద తీవ్రవాదులు పని చేస్తున్నారా?"

"చేయవచ్చును."

"నన్ను పిట్స్‌బర్గ్ వెళ్ళమంటారా?"

"నేనయితే వెళ్ళమనను. గోపాలరావుగారు ఒకటీ, మీ రొకటీ కాదు."

"థాంక్స్."

"మూర్తి ఈ ఖండం వదలిపెట్టి రాడనుకుంటాను. ఐమీన్ —— రాలేడనుకుంటాను."

"ఏం? ఎందువలన?"

"నేనొకసారి కదిపాను. అతడి చివరి రక్తంబొట్టు యీ గడ్డమీదనే రాల్చాలని వుందట!"

"అదేమిటి? మాతృదేశానికి రక్త తర్పణ చేసేవాడికి లాగా!"

జానీ పెదిమలు చప్పరించాడు.

జానీ తల్లి డ్రింక్స్ అందించింది.

"మూర్తిని తీసుకు వెళ్ళాలంటే ప్రభుత్వం వొప్పుకుంటుందా?" అడిగాడు శిరీష్.

"వొప్పుకోదు."

శిరీష్ సెలవుతీసుకుని బయటకు కదిలాడు. టాక్సీ పట్టుకుని పారగన్ హోటల్ చేరుకున్నాడు. జానీ చెప్పిన విషయాలు మననం చేసుకున్నాడు.

మూర్తిని జానీ ఎందుకు భారతదేశం పంపించలేక పోయాడు? మూర్తికి పరాయిదేశంమీద అంత మోజెందుకు కలిగింది? మూర్తిని కలుసుకోవద్దన్నట్లు జానీ పరోక్షంగా హెచ్చరించాడు. మూర్తితో తారసపడటం

నిజంగా అంత ప్రమాదంగా వుందా?

కిటికీలోంచి క్రిందకు చూశాడు. రోడ్డుమీద రద్దీగా వుంది. అవతలప్రక్క పార్కింగ్ ప్లేస్‌లో కారాగింది. కారులోంచి జానీ దిగాడు. శిరీష్ అతడివైపు నుదురు చిట్లించి చూశాడు.

డిటెక్టివ్ శిరీష్ చకచక అద్దం ముందు నిలబడి వేషం మార్చుకోసాగాడు. అయిదు నిమిషాలలో అచ్చంగా యూరోపియన్‌లాగా మారాడు. గదికి తాళంపెట్టి క్రిందకు దిగాడు. జానీ కౌంటర్‌లో యేదో విషయం దర్యాప్తు చేసినట్టుంది. వెనక్కి తిరిగి పార్కింగ్ ప్లేస్ వైపు వెళుతున్నాడు. శిరీష్ అతడివైపు చూడకుండా అటు తిరిగి కారుకు అటువైపు వచ్చాడు.

కారులో డ్రయివర్ లేడు. అతడే స్వయంగా డ్రయివ్ చేసుకువచ్చినట్టుంది. అతడు తల తిప్పకుండా వచ్చి కారులో కూర్చున్నాడు. డిటెక్టివ్ శిరీష్ చేతిలో వున్న వస్తువును క్రిందకు జారబెట్టి మధ్యలోనే బూటుతో అందుకుని కారు వెనుక చక్రం ఉబ్బెత్తు పళ్ళానికి తాకించాడు. పళ్ళెం రంగులో పల్చగా దానికి అతుక్కుపోయింది.

కారు కదిలింది.

డిటెక్టివ్ శిరీష్ అటూ యిటూ తచ్చాడి చుట్టూ పరకాయించి చూసుకున్నాడు. తనను ఎవరూ పరిశీలించడంలేదు.

6

అర్ధరాత్రి క్రమంగా గడుస్తోంది. నగరం దాదాపు నిద్రావస్థలో వుంది. ఇంకా రెండో ఆట సినిమాలు వదలిపెట్టలేదు.

గోపాలరావుగారు మోటార్ సైకిలు నడుపుతూ మే ఫెయిర్ జంక్షన్ దాటారు. వీధిదీపాల వెలుతురు అంతగా ప్రతిఫలించని చోట మోటార్ సైకిలు ఆపారు. దిగి స్టాండు వేసి చుట్టూ చూశారు.

ఒక ప్రక్కగా బార్ వుంది. దాని ప్రహరీగోడకు అనుకుని పూరిగుడిసె లున్నాయి. ఎక్కడో వూరకుక్క మొరుగుతోంది. సైకిలుకు తాళం పెట్టి నెమ్మదిగా నడవ సాగారు.

భీమరాజు యిల్లు నిశ్శబ్దంగా వుంది. వాకిట్లో పది హేను కాండిల్ బల్బు నీరసంగా వెలుగుతోంది. గోపాల రావుగారు ఇంటిని చుట్టవచ్చారు. వీధిగుమ్మం తెరిచివుంది. మెయిన్ హాలులో జీరో బల్బు వెలుగుతోంది.

హాలులో ప్రవేశించారు గోపాలరావు. భీమరాజు గది తలుపు దగ్గరగా చేరవేసి వుంది. గోపాలరావుగారు మిగతా గదుల్లోంచి అలికిడి కోసం చెవు లొరగా పెట్టి విన్నారు. పిల్లలుకానీ, భీమరాజు భార్యకానీ మెలకువలో లేరు.

భీమరాజు గదితలుపు మెల్లగా తోశారు గోపాల రావుగారు. తలుపు తెరచుకుంది. గదిలో చీకటిగా వుంది. గోపాలరావుగారు జేబులోంచి టార్చిలైటు తీశారు. అరచేతిని అడ్డంపెట్టి టార్చి వెలిగించారు. వ్రేళ్ళ మధ్యనుండి కాంతి నేలమీద పడుతోంది.

గదిని వెతకసాగారు గోపాలరావుగారు.

గదిలో ఒక మూలగా కూర్చుండి వున్నాడు భీమ రాజు. అతడి వీపు గోడమూలకు కాస్త ఒంపుగా చేరగిల పెట్టి వుంది. కాళ్ళు బార్లగిల చాపి వున్నాయి. రెండు చేతులూ రెండు తొడలమీదా ఆన్చివున్నాయి. మొహం

ఒకప్రక్క గోడకు తాకుతోంది. ఎడమకన్ను స్పష్టంగా కనిపిస్తోంది. పగిలిన పత్తి కాయలాగా తెరుచుకుని వుంది.

గోపాలరావుగారి చేతిలోంచి టార్చిలైటు పడిపోయింది. అద్దం చప్పుడు చేస్తూ చిట్లింది. నేలమీద అస్తవ్యస్తమైన వెలుగుచార దొర్లుతోంది.

అవతల గదిలో అలికిడయింది.

"ఒరేయ్ పెద్దోడా! ఎక్కడో చప్పుడయిందిరోయ్!" అంది భీమరాజు భార్య.

పెద్ద కొడుకు మాట్లాడలేదు. ఆమెకీ నిద్ర బరువుగా వుంది. గోపాలరావుగారికి తానున్న పరిస్థితేమిటో అర్థం కావడంలేదు. భీమరాజు చచ్చిపోయి వున్నాడు. ఎలా చచ్చిపోయాడు? గది మూలగా కూర్చుండి యెందుకు చచ్చిపోయాడు?

గోపాలరావుగారి వెన్ను జలదరించింది. తనకంటె యింట్లో ముందుగా ఎవరో ప్రవేశించారు. వాళ్ళు భీమరాజును చంపేశారు. గోపాలరావుగారి శరీరమంతా వొణుకుతోంది.

గోపాలరావుగారు కొంతసేపటికి కుదుటపడ్డారు. వణుకుతున్న వేళ్ళతో టార్చిలైటు అందుకున్నారు. వెలుతురు భీమరాజుమీద పడేలాగా పట్టుకున్నారు.

భీమరాజు ఒంటికంటి రాక్షసుడిలాగా కనిపిస్తున్నాడు పొడవు కమీజూ పంచెకట్టూమీదా వున్నాడు. ఒంటిమీద ఎక్కడా గాయం కనిపించడంలేదు. గాయం అటు గోడవైపు వున్న శరీరభాగంలో వున్నదేమో! నేలమీద రక్తం కూడా లేదు.

గోపాలరావుగారు యిక చూడలేక పోయారు.

వెనక్కి తిరిగారు. తలుపు దాటి మెయిన్ హాలులోకి వచ్చారు.

కళ్ళు మిరుమిట్లు గొలిపేలాగా లైట్లు వెలిగాయి. గోపాలరావుగారు స్థాణువై పోయారు. కళ్ళు కొద్ది సేపటివరకూ వెలుతురుకు అలవాటుపడలేదు.

“ఎవరు మీరు?” అరచింది ఆమె.

గోపాలరావుగారు ఆమెను భీమరాజు భార్యగా గుర్తించారు.

“ఏమండీ! దొంగ! దొంగ! ఏమండోయ్! పిల్లలూ! పెద్దోడా! మన యింట్లో దొంగ పడ్డాడు.” ఆమె పెడబొబ్బలు పెడుతోంది. గోపాలరావుగారు శక్తి తెచ్చుకుని బయటకు కదిలారు. ఆమె తన భర్త గదిలోకి పరుగెత్తింది.

కేకలు పెట్టుకుంటూ పిల్లలు లేచారు. ఇరుగు పొరుగు లేచివచ్చారు. గోపాలరావుగారిని పట్టుకున్నారు.

భీమరాజు గదిలోంచి శోకాలు వినిపిస్తున్నాయి. “హాయ్యో.... నా దేవుడిని చంపేశారండోయ్.... నేనేం చేతున్రోయ్....” అంటోంది భీమరాజు భార్య.

క్షణాలలో పోలీసులకు కబురు వెళ్ళింది.

“భీమరాజుగారిని మీరు గొంతు పిసికి చంపారు. అవునా?” అడిగాడు క్రయిమ్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్.

గోపాలరావు తల అడ్డంతిప్పారు. “నేను కాదండి ఇన్‌స్పెక్టర్‌గారూ! భీమరాజుతో ఒక రహస్యమైన విషయం గురించి అడగాలని వచ్చాను” అన్నారు.

“ఏమిటది?”

"చెప్పకూడదు."

కుమార్ కోపంగా చూచి, "దయచేసి ఏం జరిగిందో చెబుతారా?" అన్నాడు.

"చెబుతాను. భీమరాజుకు భార్యా పిల్లలూ వున్నారు. నా అల్లుడు తాత్కాలికంగా విదేశాలలో నివశిస్తున్నాడు. నా కూతురును తనకు యిచ్చి రెండో పెళ్ళి చెయ్యమంటాడు. అంతేకాదు. వితంతువైన నా చెల్లెలిని రకరకాల మాటలంటున్నాడట."

అతడు నా కూతురుపట్ల మాట్లాడిన విషయానికి మొన్న మా ఇంటికి వచ్చి క్షమాపణ అడిగాడు. మరల యీ రోజు క్లబ్బులో మగల అదే విషయం లేవనెత్తాడు. ఇక యింట్లో అతడు ఏకాంతంగా వున్నప్పుడు యీ విషయాల గురించి చర్చించి అతడితో క్షమాపణ ఉత్తరం రాయించుకోవాలనుకున్నాను.

భీమరాజు రాత్రి ఒంటిగంటవరకూ నిద్రపోడు. తన వ్యాపారం లెక్కలు జమ చూసుకుంటాడు. కాని నేను గదిలోకి వెళ్ళేసరికే అతడు చచ్చిపోయి వున్నాడు. నాకు అంతే తెలుసు!"

"ఇంట్లోకి ఎలా ప్రవేశించారు?"

"ప్రవేశ ద్వారం తెరచే వుంది."

"భీమరాజుగారు మీకు క్షమాపణ వుత్తరం రాసివ్వకపోతే హత్య చేయాలని వచ్చారా?"

"ఇన్స్పెక్టర్ గారూ! ఈ నగరంలో అంతో ఇంతో నా పేరు వినే వుంటారు. భీమరాజును హత్యచేయాలంటే నేనే స్వయంగా రావాలా? కిరాయి మనుషులను నియమించగల సత్తా వున్నవాడినని మీరూ ఒప్పుకుంటారు. భీమరాజును ఎవరు హత్యచేశారు? మీరు తెలుసుకోవాలి."

కుమార్ తలపంకించాడు. "గోపాలరావుగారూ! ఈ హత్య కేసు తేలేవరకూ మీరు నగరం విడిచిపెట్టకూడదు. బెయిలు కావాలంటే యాభై వేల రూపాయిలకు పూచీకత్తు యివ్వాలి!"

గోపాలరావుగారు తలూపారు.

ఇన్‌స్పెక్టర్ కుమార్ శవంవున్న గదిలోకి వెళ్ళాడు. ఫోటోగ్రాఫరూ, వ్రేలిముద్రల నిపుణుడూ తమ తమ విధి నిర్వహణలో తలమునకలవుతున్నారు. కుమార్ గదిని పరిశీలించి చూడసాగాడు.

మెల్లగా పెదిమ విరిచి శవంవైపు తిరిగాడు.

7

డిటెక్టివ్ శిరీష్ చేతివాచీ చూసుకున్నాడు. వాచీలో సగం భాగం సమయం చూపిస్తోంది. మిగతా సగం మినీ కంప్యూటర్. రకరకాల మీటలున్నాయి. మీట నొక్కి అట్టే పెట్టాడు శిరీష్. సమయం చూపించే తెర తెల్లగా అయింది.

"రింగ్ .... రింగ్ ...." తెల్లటి తెరమీద చుక్క కదలడం ప్రారంభమయింది. ఎర్రటి చుక్క వేగంగా కదులుతోంది.

డిటెక్టివ్ శిరీష్ కారు స్టార్టుచేశాడు. చుక్క కదులుతోన్న దిశను డిగ్రీలతో గుర్తించి కారును అటు కదిపాడు. నున్నటి విశాలమైన సిమెంట్ రోడ్డుమీద కారు పాదరసంలాగా జారుతోంది. చుక్క దిశమారి క్రిందకు జరుగుతోంది. రోడ్డుప్రక్క బోర్డులు కనిపించి మాయమవుతున్నాయి.

ముందు ప్రయాణిస్తోన్న చుక్క పిట్స్‌బర్గ్ వైపు

ప్రయాణిస్తోంది. పిట్స్‌బర్గ్ యింకా యిరవై కిలోమీటర్లుండగా చుక్క ఆగిపోయింది. డిటెక్టివ్ శిరీష్ కారు వేగం పెంచాడు. రానురాను చుక్క దగ్గరపడుతోంది.

డిటెక్టివ్ శిరీష్ కారును రోడ్డుదింపి పొదలమధ్య ఆపాడు. వాచీ చూసుకుంటూ ముందుకు కదిలాడు.

దూరంగా పాడుపడిపోయిన కోట గోడలు కనిపిస్తున్నాయి. పొదలలోంచి ప్రాకుతూ గోడలకు సాధ్యమైనంత దగ్గరగా వెళ్ళాడు. గోడలమధ్య ఖాళీస్థలం వుంది. ఆ స్థలంలో నలుగురు యువకులు మెషీన్ గన్స్ పట్టుకు కూర్చున్నారు. వాళ్ళకు యివతల జానీ నిలబడి ఒక యువకుడితో మాట్లాడుతున్నాడు. ఖాళీస్థలంలో విమానం ఆగివుంది.

డిటెక్టివ్ శిరీష్ ఆ యువకుడిని గుర్తుపట్టాడు. అతడు గోపాలరావుగారి అల్లుడు. మొహంలో ఒక రకమైన ప్రశాంతత వుంది. ప్రశాంతత వెనుక ఎలాంటి ఆవేశం వుందో కాని చీటికి మాటికి పళ్ళు పటపటలాడిస్తున్నాడు. జానీవైపు చూడకుండా జవాబులు చెబుతున్నాడు.

"హోటల్‌లో దిగాడంటే మాట్లాడవేం?" అన్నాడు జానీ.

"నేను భారతదేశం వెళ్ళేది లేదుకదా! యెందుకు కంగారు పడతావు?" అన్నాడు మూర్తి.

"అతడిని కూడా వెళ్ళనివ్వకుండా చేయాలి."

"చెయ్యి. నాకు చెబుతావేం?"

"నిన్ను వెతకడానికి మీ మామయ్య యెంతమందిని పంపుతాడో చూడాలి. ప్రతి ఒక్కడిని యిక్కడ చంపి పారెయ్యాలి!"

"ఫూః! చంపెయ్! నాకెందుకు చెబుతావు?"

"తప్పకుండా! ఈ రోజు బొగ్గుగని కార్మికుల గురించి వాళ్ళ యజమానులతో మాట్లాడతానన్నావుగుర్తుందా?"

"ఆఁ! బయలుదేరదాం!" మూర్తి కదిలాడు. తన అనుచర వర్గానికి జాగ్రత్తగా వుండమని చెప్పి జానీతో కలిసి బయలుదేరాడు.

డిటెక్టివ్ శరీఫ్‌కి కొన్ని క్షణాలపాటు ఏం చేయాలో అర్థంకాలేదు. మూర్తిని పిట్స్‌బర్గ గని కార్మికుల సమావేశంవరకూ వెంబడించి వెళ్తే ప్రయోజనం ఏముంటుంది? అతడి కారుకే తాను ట్రాన్స్‌మీటర్ అతికించి మూర్తి వుంటున్న రహస్య స్థావరం తెలుసుకున్నాడు.

జానీ అంతరాంతరాల్లో వున్న కోరిక ఏమిటి? ఎందుకతడు కావాలని మూర్తి చిరునామాను గోపాలరావు గారికి యిచ్చాడు? కావాలని తనమీద దాడికి సిద్ధపడుతున్నాడు?

జానీ, మూర్తీ కలసి బయలుదేరుతున్న కారు బయలుదేరింది. డిటెక్టివ్ శరీఫ్ వచ్చిన దారినే తిరిగి వెళ్ళి కారులో కూర్చున్నాడు. వాచీ చూసుకున్నాడు. తెల్లటి తెరమీద చుక్క తిరిగి ప్రయాణం మొదలుపెట్టింది.

శరీఫ్ కారును రోడ్డుమీదకు మళ్ళించి చుక్కను వెంబడించసాగాడు.

పిట్స్‌బర్గ్ బొగ్గుగనులు రానురాను దగ్గరవుతున్నాయి. విశాలమైన ఆరుబయలులో ఎత్తయిన భవనాలు నిర్మించి వున్నాయి. బొగ్గు తీసుకు వెళ్ళడానికి ప్రత్యేకంగా మోటర్ గేజ్ రైల్వే లైను రోడ్డుకు సమాంతరంగా నిర్మించి వుంది. వుండి వుండి గూడ్సుబండి నల్లటి యాభై వేగన్లతో బొగ్గు తీసుకు వెళుతోంది.

తెల్లటి తెరమీద చుక్క ఆగింది. ఎత్తయిన భవ

నాలుకు యిళతల కారు ఆగి వుంది. ఆ కారులోంచి మూర్తి దిగాడు. కారు తీసుకుని జానీ వెళ్ళిపోయాడు. డిటెక్టివ్ శరీఫ్ కారును రోడ్డుకు బాగా ప్రక్కకు తీసి భవనాలవైపు నడక సాగించాడు. బొగ్గు గనుల్లో కార్మికుల కేకలు వినిపిస్తోన్నాయి.

మూర్తి లోపలకు వెళ్ళిన భవనం గుర్తుపెట్టుకున్నాడు. ఆ భవనంలో అడుగుపెట్టాడు. డిటెక్టివ్ శరీఫ్ చురుకుగా అటు నడిచాడు.

క్రేన్స్ పెద్ద పెద్ద బరువులను వాగన్స్‌లో దింపడం వలన శబ్దాలవుతున్నాయి. గోడవారనుండి కదిలాడు శరీఫ్. మూర్తిని ఎలా ఎదుర్కోవడం? అతడు జానీతో మాట్లాడినప్పుడు 'నేను భారతదేశం వెళ్ళేది లేదు కదా, ఎందుకు కంగారు పడతావు?" అన్నాడు. అంటే మూర్తికి స్వదేశం తిరిగి వెళ్ళిపోవాలని వుంది. ఇక్కడి పరిస్థితులు అతడిని తిరిగి వెళ్ళకుండా చేస్తున్నాయి. ఏమిటవి?

గోడపక్కనుండి స్తంభంవైపు జరిగాడు డిటెక్టివ్ శరీఫ్.

"చేతులెత్తి వుంచు మిష్టర్ శరీఫ్."

శరీఫ్ కనుబొమలు ముడిపడ్డాయి. యథాలాపంగా చేతులెత్తి వుంచాడు.

"నీకోసం హోటలుకు వెళ్ళారు నా మనుషులు. నువ్వు చాలా సేపటి క్రితంనుండి గదిలో లేవు. ఆ విషయం యిప్పుడే నాకు వైర్‌లెస్‌లో పంపారు. నువ్వు పిట్స్‌బర్గ్ వస్తావని తెలుసు నాకు! మూర్తిని భారతదేశం తీసుకు వెళ్ళాలన్న నీ వూహ కట్టిపెట్టు."

"జానీ! అతడికి భారతదేశం తిరిగి వెళ్ళిపోవాలని

వుంది. నువు అతడిని తీవ్రవాద కార్యకలాపాలలో యిరి కించి వెళ్ళకుండా చేస్తున్నావు. కారణం తెలుసుకో వచ్చునా?"

జానీ నవ్వి, "ఆ కారణం నువు తెలుసుకుంటే భారత దేశం వెళ్ళలేవు. ఈ గనుల్లో ఎక్కడో సజీవ సమాధి అవుతావు!" అన్నాడు.

శరీఫ్ ఆలోచించదల్చుకోలేదు. జానీలాంటి ముసలి వాడివద్ద పిస్టోలు వుండనీ, ఎటువంటి మారణాయుధం వుండనీ ___ అతడిని లొంగతీసుకోవడం పెద్ద సమస్య కాదు.

"చెప్పు. ఏం ఫరవాలేదు."

"శరీఫ్! నామాట అబద్ధం అనుకోవద్దు. నిజంగా నీ నిన్ను యిక్కడ చంపేస్తాం!"

శరీఫ్ మందహాసం చేశాడు. మా దేశంలో ఒక సామెత వుంది. మొరిగే కుక్క కరవదు! అని, ఆట్టే వాగక నువు మూర్తిని ఎందుకు స్వదేశం వెళ్ళనివ్వడం లేదో చెప్పు."

"మూర్తి ఇక్కడ నా చెల్లెలిని పెళ్ళి చేసుకున్నాడు."

"అదెలా సాధ్యం? అతడికోసం భారత దేశంలో ఎదురు తెన్నులు చూస్తున్న అతని భార్య వుంది. అతడి కోసం ఎంతయినా ఖర్చు పెట్టగల మామగారు వున్నారు."

"ఆ ఆస్తి నాకు కావాలి. మూర్తి మొహమాట పడు తున్నాడు. గోపాలరావు యెప్పటికయినా తన ఆస్తి మొత్తంగానయినా నన్ను తీసుకోమని చెప్పి అల్లుడిని పంపించమని కోరతాడు. అందుకోసమే వెయిట్ చేస్తు న్నాను. మధ్యలో నువు పానకంలో పుడకలాగా వచ్చావు."

"నీ మనసులో వున్నమాట గోపాలరావుగారికి రాయవచ్చును కదా!"

జానీ పిస్తోలు గొట్టంతో అతడి మెడమీద పొడిచాడు. "ప్రస్తుతం ఆ ప్రయత్నంలోనే వున్నాను. నడువు....లోపలకు...." అన్నాడు.

శిరీష్ మెల్లగా కదిలాడు.

"మూర్తిని మీ దేశం చట్టం క్షమించదు. తీవ్రవాద చర్యలపట్ల మీ అధ్యక్షుడు ఆందోళన వెలిబుచ్చాడు. అతడితో నీ చెల్లెలు మాత్రం ఏం సుఖపడుతుంది?" అన్నాడు శిరీష్.

జానీ మాట్లాడలేదు.

పిస్తోలు మాత్రం అతడి వెన్నులో గుచ్చి "పద!" అని అరిచాడు.

డిటెక్టివ్ శిరీష్ ముందుకు మెల్లగా అడుగువేశాడు. గుమ్మం దగ్గరాతోంది. గుమ్మం ప్రక్కనే కిటికీ వుంది. చటుక్కున కిటికీ చువ్వలు పట్టుకున్నాడు. రెండు చేతులతో మొత్తం శక్తిని కేంద్రీకరించుకున్నాడు. శరీరం మొత్తం చేతుల శక్తిమీద వెనక్కి గాలిలో లేచి ఫెడీల్మని జానీను తన్నాడు.

జానీ యీ వెనుకవాటు దెబ్బ కాచుకోవడానికి సిద్ధంగా లేడు. ఆ దెబ్బ ఎక్కడ తగలాలో అక్కడే తగిలింది. జానీ మారుమాట లేకుండా నిశ్శబ్దంగా నేలమీదకు ఒరిగిపోయి స్పృహ తప్పి పడిపోయాడు. డిటెక్టివ్ శిరీష్ చటుక్కున అతడి చేతిలోంచి పిస్తోలు తీసుకున్నాడు. అతడిని ఎవరు చూడని మారుమూల ప్రదేశానికి యీడ్చి జేబులోంచి నైలాన్ తాళ్ళుతీసి కాళ్ళకూ చేతులకూ బంధాలు వేశాడు. తర్వాత నోటికి ప్లాస్టర్

వేశాడు.

తరువాత చుట్టూ చూసుకుంటూ వెళ్ళి కారులో కూర్చున్నాడు శిరీష్. ఓపికగా మూర్తికోసం వేచి చూడసాగాడు. గంట తర్వాత మూర్తి భవనంలోంచి యివతలకు వచ్చాడు. అటూ ఇటూ చూశాడు. తర్వాత తానూ జానీ కలసి వచ్చిన కారుకోసం చూశాడు.

రోడ్డుమీద శిరీష్ కారు కనిపించింది. శిరీష్ తన మొహం కనిపించకుండా వెనక్కి తిరిగి కూర్చున్నాడు. బొగ్గుగనుల ప్రాంతం కావడంతో, దూరప్రదేశం కావడంతోనూ ప్రయివేట్ రవాణా సౌకర్యాలుండవు. మూర్తి అందుకే శిరీష్ కూర్చున్న కారువైపు వచ్చాడు.

“లిఫ్ట్ యిస్తారా మిస్టర్?” అన్నాడు మూర్తి.

అతడి మాట నోటిలోనే ఆగిపోయింది. డిటెక్టివ్ శిరీష్ అతడి నోటిలో పిస్టోలు గొట్టం వుంచి, “సేఫ్టీ కాచ్ తప్పించాను.... తెలుసా?” అన్నాడు.

మూర్తి కళ్ళు పెద్దవిచేశాడు. మాట్లాడబోయాడు. సాధ్యం కాలేదు.

“మూర్తీ! ట్రిక్స్ అనవసరం” శిరీష్ రెండో చేత్తో చటుక్కున చేతిలో సిద్ధంగా వుంచుకున్న సూదిని మూర్తి చేతిమీద బలంగా గుచ్చాడు. మూర్తి ప్రతిఘటించేలోపుగానే సూదిని చివర పూసిన ఘాటైన మత్తుమందు రక్తంలోకి రవాణా అయింది. మూర్తి మగతగా జోగాడు. వెనక్కుతూలి రోడ్డుమీదకు మెల్లగా ఒరిగిపోయాడు.

శిరీష్ అతడిని కారులోకి చేర్చాడు. అతడి కాళ్ళూ, చేతులూ నైలాన్ త్రాటితో బంధించి, నోటికి ప్లాస్టరంటించాడు. కారు వెనక్కి తిరిగింది. వచ్చిన దారినే

ప్రయాణం మొదలుపెట్టింది.

తీవ్రవాదుల స్థావరం దగ్గరవుతోంది. గాలి చల్లగా వీస్తోంది. డిటెక్టివ్ శరీష్ ఏమరుపాటు లేకుండా చుట్టు ప్రక్కలా, వెనక్కీ, స్థావరంచుట్టూ వున్న చెట్లలోకి చూడసాగాడు. అతడి నుదురు ముడతలు పడింది. పెదిమలు బిగుసుకున్నాయి.

చెట్ల చాటునుండి సాయుధులు ఒక్కరొక్కరు రోడ్డుకు అడ్డంగా వచ్చి నిలబడ్డారు. మొత్తం నలుగురు. వారిలో ఒకడు జపానీ.

'చంపుతావా! చస్తావా?' అన్నట్టు తీక్షణంగా కారువైపే చూస్తున్నారు. సాయుధులకు సమాచారం ఎలా అందింది? మూర్తి తన దుస్తుల్లో మినీ ట్రాన్స్‌మిటర్ అమర్చుకుని బయలుదేరతాడా?

కారుదగ్గర పడుతూంటే వాళ్ళు మెషీన్‌గన్స్ కారుకు గురిపెట్టి వుంచారు. డిటెక్టివ్ శరీష్ చటుక్కున స్టీరింగ్ వీల్ మీద బూటుకాలుంచి వెనక సీటుమీద కూర్చుండి మూర్తిని అతికష్టంమీద ముందుకి లాక్కున్నాడు. మూర్తి సీటుమీద అడ్డదిడ్డంగా వాలిపోయి వున్నాడు.

మెషీన్‌గన్స్ ప్రేలుతున్నాయి. కారు యింజన్ భాగం మోత మోగిపోతోంది. డిటెక్టివ్ శరీష్ కారాపాడు. మూర్తి మొహాన్ని కిటికీలోంచి బయటికి కనబడేలాగ పట్టుకున్నాడు.

"డిక్కీలో జానీ వున్నాడు. జాగ్రత్త! పెట్రోలు టాంకు అంటుకునిమండే ఏర్పాటు చేశాను. నాతోబాటు జానీ, మూర్తీ ఇద్దరూ మాడి మసై పోతారు" అరిచాడు శరీష్.

సాయుధుల కాల్పులు ఆగలేదు. ఇంజన్ తుక్కు-

తుక్కుగా చెడిపోతోంది. మూర్తి శరీరం చాటునుండి పిస్తోలు వాళ్ళవైపు గురిపెట్టాడు శరీఫ్. మూర్తి శరీరాన్ని తప్పించి పిస్తోలును చకచక ప్రేల్చాడు.

బులెట్లు గురి తప్పలేదు. ముగ్గురు సాయుధులు రోడ్డు మీద పడిపోయారు. నాలుగోవాడు మెషీన్ గన్ ని గురి మార్చి శరీఫ్ వైపు కాల్చాడు. విండ్ స్క్రీన్ భళ్ళున పగిలిపోయింది.

శరీఫ్ తల వాల్చి పిస్తోలు ప్రేల్చాడు. నాలుగోవాడు తుళ్ళి రోడ్డుకు అవతలపడ్డాడు. అతడి చేతిలోని మెషీన్ గన్ ఎగిరి అవతలపడింది. అతడు విసురుగా లేవబోయాడు. సాధ్యపడలేదు. వెన్నెముకమీద పెద్ద దెబ్బ తగిలింది. డిటెక్టివ్ శరీఫ్ రెండు నిమిషాలు వ్యవధి పోనిచ్చి అతడిని సమీపించాడు.

అతడు కోపంగా చూస్తున్నాడు. జపాన్ దేశీయుడు.

"స్థావరంలో యెంతమంది వున్నారు?" అడిగాడు శరీఫ్.

అతడు మాట్లాడలేదు. డిటెక్టివ్ శరీఫ్ అతడిని యీడ్చిపెట్టి తన్నాడు. అతడి చెక్కిలి చిట్లి రెండు దంతాలూ రాలాయి. బాధను పండ్లబిగువున ఓర్చుకున్నాడు. శరీఫ్ మరల కాలెత్తాడు.

ఎవరూ లేరన్నట్లు అతడు సంజ్ఞ చేశాడు. డిటెక్టివ్ శరీఫ్ అతడిని కూడా కారులో కూర్చుండబెట్టాడు. తరువాత కారును రోడ్డు క్రిందకు దింపాడు. నేరుగా పాడుపడిన కోట ప్రక్కగా ఆగివున్న విమానం వద్దకు తీసుకుపోయాడు. ఇరవై మంది ప్రయాణించగల కారవెల్లీ విమానం!

జపనీ చెప్పినట్లు స్థావరం ఖాళీగా వుంది. డిటెక్టివ్

శరీఫ్ మెల్లగా మూర్తిని విమానంలోకి చేర్చాడు.

శరీఫ్ పైలట్ సీటులో కూర్చున్నాడు. విమానం రన్‌వేమీద పరుగెత్తుతోంది.

విమానం చిన్న కుదుపుతో గాలిలోకి లేచింది.

8

"అత్తయ్యా! అత్తయ్యా!" మాధవి మెయిన్ హాలులో నిలబడి అరుస్తోంది.

అనసూయ మెల్లగా పిట్టగోడకు వచ్చింది. కిందకు చూచింది.

"అత్తయ్యా! నాన్నగారు యింకా లేవలేదు. లోపలి వైపు గడియపెట్టి మరీ పడుకున్నారు" అంది మాధవి.

"అరరె! యింకా లేవలేదా? ఇంతసేపు యెన్నడూ నిద్రపోడు అన్నయ్య."

"అవునత్తయ్యా!"

"రాత్రి నీతో ఏమీ చెప్పలేదా?"

"చెప్పారు ఉదయాన్నే భీమరాజు యింటికి వెళ్ళన్నారు. హత్య జరిగిన రోజు రాత్రి భీమరాజు ఇంటికి వచ్చిన స్త్రీని ఇరుగుపొరుగు ఎవరో చూశారట. పోలికలు అడగడానికి వెళ్తానన్నారు."

"ఇదెక్కడి చోద్యం మాధవీ! పోలీసులు పరిశోధిస్తారు కానీ....మన కెందుకొచ్చిన గోల!"

మాధవి మాట్లాడలేదు. మరల వెళ్ళి తండ్రి గది తలుపులు తట్టి వచ్చింది. అనసూయకూడా వెళ్ళి "అన్నయ్యా! అన్నయ్యా!" అని నిద్ర లేపాలని ప్రయత్నించింది.

"లాభం లేదమ్మా! తలుపులు తెరిపించాలి. అన్నయ్య యింత మత్తుగా ఎందుకు నిద్రపోతాడు?"

"అంటే..." మాధవి గొంతు వణికింది,

అనసూయ పనివాడిని పిలిచింది.

"ఎవరినయినా వడ్రంగిని తీసుకురా! అయ్యగారి గది తలుపు తెరిపించాలి!" అంది అనసూయ.

మాధవి పనివాడిని వారించి, "అత్తయ్యా! నాకేదో భయంగా వుంది. ఇన్‌స్పెక్టర్ కుమార్‌కి ఫోన్ చేద్దాం. ఎందుకయినా మంచిదికదా!" అంది.

అనసూయ అంగీకారంగా తలూపింది.

పావుగంటలో కుమార్ తన సిబ్బందితో దిగబడ్డాడు. బలవంతంగా తలుపులు తెరిపించాడు.

గోపాలరావుగారు మంచంమీద వెల్లకితలా పడుకున్నారు. కళ్ళు తెరచుకుని వున్నాయి. నోరు ఆవులించి వుంది. కాళ్ళూ చేతులూ నిట్రాటల్లాగా బిగుసుకుపోయి వున్నాయి.

మాధవి గొల్లున యేడవబోయింది. స్పృహ తప్పి తండ్రిమీద పడిపోయింది. అనసూయ ఏడుస్తూనే మేనకోడలిని ప్రక్కకు తప్పించి వేసింది. బయట సోఫాలో పడుకో బెట్టింది.

ఇన్‌స్పెక్టర్ కుమార్ తన సిబ్బందికి సూచనలిస్తున్నాడు. పోర్టికోలో టాక్సీ ఆగింది. డిటెక్టివ్ శిరీష్ మూర్తి చకచక అడుగులువేసుకుంటూ లోపలికి వచ్చారు.

సోఫామీద మాధవి నిద్రపోతోంది. మూర్తి ఆమె వద్ద కూర్చున్నాడు. డిటెక్టివ్ శిరీష్ లోపలకు నడిచాడు.

కుమార్ అతడిని కౌగలించుకున్నంత పనిచేసి, "సమయానికి వచ్చావు సోదరా! హత్య కేసులూ, చావులూ.. చస్తున్నాననుకో!" అన్నాడు.

అతడి భుజం తట్టాడు శిరీష్. గోపాలరావుగారి మొహంలోకి చూశాడు. కళ్ళు పత్తికాయల్లాగా తెరచు

కని వున్నాయి. ఎడమ కన్ను ఎర్రటి నెత్తురు గడ్డలాగా అయి క్రమంగా నిలబడినట్టుంది.

"ప్రాథమిక దర్యాప్తులో గోపాలరావుగారి గుండె ఆగి మరణించి వుండాలనిపిస్తోంది. సుఖమైన మరణం! గోపాలరావుగారికి గుండె జబ్బుకు సంబంధించి ఆయన కుటుంబ వైద్యుడిని సంప్రదించాలి" అన్నాడు పాథాలజీ సర్జన్.

"కన్ను నెత్తుటిగడ్డలాగా కావడం ఏమిటి? గుండె ఆగి మరణించినప్పుడు ఇలా కావడం ఎన్నడూ వినలేదు" అన్నాడు శిరీష్.

సర్జన్ తలూపి, "కంట్లో ప్రాణం పోకముందు క్షార పదార్థం పడివుండాలి. ఆ బాధ తట్టుకోవడానికి ప్రయత్నిస్తూంటేనే గోపాలరావుగారిలో గుండెపోటు రేగి వుండాలి" అన్నాడు. "కాని....ఆ బాధ కూడా కొన్ని క్షణాలపాటే!"

"ప్రాణంపోయి ఎంతసేపయి వుంటుంది?"

"రిగర్ మార్టిస్ ప్రారంభమయింది. 5_8 గంటల లోపు అంటే రాత్రి పదకొండు తర్వాత ఒంటిగంట కంటె ముందు ప్రాణంపోయి వుండాలి."

డిటెక్టివ్ శిరీష్ గదిని కలయ తిరిగాడు. గదిలో యెక్కడా విచిత్రంగా గానీ, అనుమానించదగిన వస్తువు గానీ కనిపించలేదు.

"ప్రాణం క్షణాలలో పోయింది కదూ సర్జన్ గారూ!" అడిగాడు శిరీష్.

"అవును. రోగి యెలాంటి హింసా పడకుండానే ప్రాణంపోయింది."

"గుండెపోటు వచ్చిన వ్యక్తి అలా పోడు."

"కావచ్చు. గుండెపోటు తీవ్రతమీద అది ఆధారపడి వుంటుంది."

"నీ సందేహం ఏమిటి శిరీష్?" కలగజేసుకున్నాడు కుమార్.

"కంట్లో పడిన పదార్థం ఏమిటి? ప్రాణం పోవ డానికి అది ఎంతవరకూ కారణం? గుండెపోటు కారణమై వుండదేమో...."

"అది శవ పరీక్షలో నిర్ధారణ అవుతుంది. దానివల్లే ప్రాణంపోయి వుంటే....?"

"అది గోపాలరావుగారి గదిలోకి ఎలా వచ్చింది? కిటికీ మంచానికి దూరంగా వుంది. తలుపులు లోపలనుండి వేసివున్నాయి. ఎలా సాధ్యం?"

సర్జన్ చిరాకుగా చూచి, "మామూలు మరణం కేసుకు మీరు హత్య రంగు పూస్తున్నారేమో శిరీష్ గారూ!" అన్నాడు.

శిరీష్ మందహాసం చేసి, "నా అనుమానం తప్పు కావచ్చు. జపాన్ నుండి అతికష్టంమీద భారతదేశం విమానంలో వచ్చాం. మనసు యింకా కుదుటపడలేదు" అన్నాడు.

సర్జన్ మొహంలో విజయగర్వం ప్రతిఫలించింది. అప్పటికి ఫోటోగ్రాఫరూ, వ్రేలిముద్రల నిపుణుడూ తమ బాధ్యతలు ముగించుకున్నారు. గోపాలరావుగారి భౌతిక కాయాన్ని అంబులెన్స్‌లో చేర్పించాడు కుమార్.

కదులుతోన్న అంబులెన్స్‌వైపు నిర్లిప్తంగా చూశాడు మూర్తి.

"మూర్తిగారూ! మీ మామయ్యగారిని యెవరో తెలివిగా హత్యచేశారు. కంట్లో సైనెడ్—అది పొటా

షియం సైనైడ్ కావచ్చును. దాన్ని కంట్లో పడేలాగా చేసి ప్రాణాలు తీశారు."

మూర్తి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తరువాత అతడి పిడికిళ్ళు బిగుసుకున్నాయి. "శరీఫ్ గారూ! గోపాలరావు గారు ఉత్తముడు. అలాంటివారిని పొట్టన పెట్టుకున్న వారిని వదలిపెట్టను" అన్నాడు.

శరీఫ్ అతడి భుజంతట్టి, "హంతకులకు మీరు ఇక్కడ లేకపోవడం బాగా సహకరించింది. హత్యకు ప్రేరేపించింది కూడా మీ గైర్హాజరే! మీరు నిగ్రహంతో వ్యవహరించాలి" అన్నాడు.

"శరీఫ్ గారూ! మీకు ప్రామిస్ చేస్తున్నాను. మాధవిని విడిచి ఇక ఎక్కడికీ వెళ్ళను. విప్లవం జోలికి అసలే వెళ్ళను" అన్నాడు మూర్తి సిన్సియర్ గా.

9

డాట్సన్ కారును బయలుదేరతీశాడు. భీమరాజా యింటిముందు కారాపాడు.

భీమరాజు భార్య చిరాకుగా చూచి, "ఆయనపోయి నేను ఏడుస్తున్నాను. ఆయనను యింతవరకూ యెవరు గొంతు నులిమి పొట్టన పెట్టుకున్నారో కనిపెట్టలేకపోయారు, కాని ప్రశ్నలతో బతికివున్న నన్నుకూడా చావగొడుతున్నారు" అంది.

డిటెక్టివ్ శరీఫ్ ఓపికగా చూచి, "భీమరాజుగారు చనిపోయిన రాత్రి ఒక స్త్రీ మీ యింటికి వచ్చింది. కొత్త స్త్రీ కాదనీ, మీరే ఆ రాత్రి 9-30కి 10 గంటలకూ మధ్యలో ఎక్కడికో వెళ్ళి తిరిగి వచ్చారనీ పోలీసుల పరిశోధనలో తేలింది. ఏమంటారు మీరు?" అన్నాడు.

భీమరాజు భార్యకు మొహం కళ తప్పింది.

"మీతో ఆ మాట ఎవరు చెప్పారు?"

"పోలీసులు. అంతే కాదు. ఇరుగు పొరుగువారు మిమ్మల్ని ఆ సమయంలో యింట్లోకి రావడం చూశారు. అవునా?"

భీమరాజు భార్య అరచేతులలో మొహం కప్పుకుంది. "నిజమే!" అంది.

"ఆ రాత్రివేళ మీరు ఎక్కడినుండి తిరిగివచ్చారు?" అన్నాడు శిరీష్.

"నా భర్తకోసం ఒక స్త్రీ యీ దగ్గరలో వున్న సిటీ బస్ స్టాప్‌లో వెయిట్ చేస్తున్నదని ఒక కుర్రవాడు తీసుకువచ్చిన చీటీవల్ల తెలుసుకున్నాను. అప్పుడు రాత్రి తొమ్మిదయింది. నేను ఒక్కతెనూ సిటీ బస్‌స్టాప్‌కి వెళ్ళి అక్కడ నిలబడ్డాను. నా భర్త యింట్లో తన గదిలోనే వున్నాడు. బస్సుకోసం వెయిట్ చేస్తున్న స్త్రీలు మాత్రమే ఒకరిద్దరు తమ బస్సులు రాగానే వెళ్ళిపోయారు. నేను తిరిగి వచ్చాను."

"మీ భర్త గదిలోకి వెళ్ళారా?"

"లేదు. ఆయన అప్పటికే పూర్తి నిషాలో వుంటారు."

"మీ భర్త గదిలోనే వున్నట్టు నిర్ధారణ చేసుకున్నారు కదూ!"

"చేసుకున్నాను. ఆయన గదిలో మూలగా కూర్చుని వున్నారు.." ఆమె గొంతు బొంగురుపోయింది. "ఆయన అప్పటికే ప్రాణాలు పోయి ఆ స్థితిలో వున్నారని గ్రహించలేకపోయాను. పాపిష్ఠిదాన్ని."

"మీరు యిల్లు వదలిపెట్టి తిరిగివచ్చేలోపుగా ఎవరో యింట్లో ప్రవేశించి వుంటారు, అవునా?"

"అవునండి. ఇంటికి గొళ్ళెం పెట్టి వెళ్లాను. తిరిగివచ్చే టప్పటికి గొళ్ళెం అలాగే వుంది. ఎవరో ప్రవేశించి తిరిగి వెళ్ళిపోయి వుంటారని వూహించలేకపోయాను!"

"మీరు తిరిగివస్తూంటే దారిలో ఎవరయినా యెదురు వచ్చారా?"

"ఒక నడివయస్కురాలు కాబోలు..ఎదురువచ్చింది."

"ఆమెను మరల చూస్తే గుర్తుపట్టగలరా?"

"తలమీదనుండి పమిటకొంగు తిప్పుకుంది. స్పష్టంగా చూశానని చెప్పలేను."

"ఆమెను అంతకుముందుకూడా చూచి వుండరు. అవునా?"

"అదీ చెప్పలేను."

"ఆమె తప్ప దారిలో మీకెవ్వరూ కనిపించలేదా?"

"లేదు."

"మీరు దారిలో చూచిన ఆమె గురించి మరికొన్ని వివరాలు చెప్పడానికి ప్రయత్నించండి. బహుశా ఆమె మీ యింట్లో ప్రవేశించడంకోసం మాత్రమే మిమ్మల్ని బస్‌స్టాప్‌కి పంపించడం జరిగింది."

భీమరాజు భార్య తెల్లబోయింది.

"ఒక్కసారి భీమరాజుగారి గది చూపిస్తారా?"

ఆమె తలూపి బయలేరింది. భీమరాజు గదిలోకి శిరీష్‌ను ప్రవేశపెట్టింది. శిరీష్ ఆ గదిని పరిశీలించాడు. ఆ గదికి రెండు గుమ్మాలున్నాయి. రెండో గుమ్మంలోంచి పెరట్లోకి వెళ్ళవచ్చును.

డిటెక్టివ్ శిరీష్ పెరట్లోకి నడిచాడు. పెరట్లోంచి సందులోకీ, అటునుంచి రోడ్డుమీదికీ వచ్చాడు.

భీమరాజు హత్య విషయంలో, గోపాలరావుగారి

హత్యవిషయంలో ఎవరున్నారు? అసలు గోపాలరావుగారి మరణం ఎవరికి లాభిస్తుంది?

డిటెక్టివ్ శిరీష్ చుట్టు తిరిగి కారువద్దకు వచ్చాడు. కారును గోపాలరావుగారింటి వద్దకు తోలాడు. మాధవి తన గదిలో ఏడుస్తూ కూర్చునివుంది.

డిటెక్టివ్ శిరీష్ ఆమెను పూరడించాడు.

"మూర్తిగారు లేరా?" అడిగాడు శిరీష్.

"ఎవరో స్నేహితులు ఆయనకు ఫోన్ చేసి రప్పించుకున్నారట."

"ఎక్కడికి?"

"ఎక్కడికో తెలియదు సార్! ఆయన వెళ్ళడం నాకే తెలియదు. పనివాడు చెప్పాడు."

శిరీష్ నుదురు చిట్లించాడు. మూర్తిని ఇల్లు కదలవద్దని తాను హెచ్చరించాడు. తీవ్రవాద ముఠాలోంచి ఒక వ్యక్తి బయటపడటం ఆ ముఠాలో వున్న వారికి హితవుగా వుండదు. మూర్తిని భారతదేశం వరకూ వెంబడించుకు వచ్చినా ఆశ్చర్యంలేదు.

శిరీష్ తన ఆందోళనను తనలోనే యిముడ్చుకున్నాడు.

"నాన్నగారి గది ఒకసారి చూపించాలి మాధవి గారూ!"

మాధవి అతడిని తండ్రి గదిలోకి తీసుకువెళ్ళింది.

"మీ నాన్నగారు తన ఆస్తి మొత్తం తన తదనంతరం మీకే రాశారా, మాధవిగారూ!"

"మా మేనత్తకు కూడా కొంత ఆస్తి రాశారు."

"మీ మేనత్త యెటువంటిది? అంటే ఆస్తికోసం యెలాంటి అఘాయిత్యానికయినా సిద్ధపడే తరహా

మనిషా?"

"అటువంటిదో, కాదో చెప్పలేనుకానీ,నన్ను మాత్రం తన కొడుకుకు ఇచ్చి పెళ్ళి చేసుకోవాలని ఉబలాట పడేది."

"ఆమె గది ఎక్కడ?"

ఆమె వ్రేలు పైకి చూపించి, "సరిగ్గా పై గదే! వెళ్దామా?" అంది.

డిటెక్టివ్ శరీఫ్ మొహంలో వెలుగు కనిపించింది. పైకి చూశాడు. గోపాలరావుగారు పడుకునే బెడ్ కి తలపైపుగా సీలింగ్ ఫాన్ వుంది.

"పైగదికి వెళ్దాం. అన్నట్టు మీ అత్తయ్య వుందా?"

"లేదు. తల్లీ కొడుకులు బయటికి వెళ్ళారు."

"రమేష్ ఎలాంటి వాడు?"

"అందితే జుత్తూ, అందకుంటే కాళ్ళూ పట్టుకునే రకం!"

"మాధవిగారూ! భీమరాజుకు మీ యింట్లో అందరి తోనూ పరిచయం వుందా?"

"వున్నదనే నా అనుమానం! కాని నిరూపించలేను."

"నిరూపణా! ఏ విషయంలో?"

"ఒకసారి మా అత్తయ్య, భీమరాజూ కలిసి ఒకే ఆటోలో వెళ్తున్నట్టు నా అనుమానం! ఆ వ్యక్తి భీమరాజు కాకపోయినా మరో మగాడు మాత్రం అవును. నాన్నగారు మాత్రం నన్ను నమ్మలేదు."

"భీమరాజే అయివుండవచ్చునేమో!"

"నూటికి తొంభై తొమ్మిది పాళ్ళు."

"గుడ్....చాల లింకులు విడిపోయాయి...."

అనసూయ గదిలో ప్రవేశించాడు డిటెక్టివ్ శరీఫ్.

నేలమీదకు చూశాడు. అతడి కళ్ళు గచ్చుమీద పరిశీలనగా వెతుకుతున్నాయి. క్రింద ప్రక్క ఫ్యాన్ కొక్కెం తగిలించి వుండే ప్రదేశంలో చేతితో తడిమాడు. నున్నటి గచ్చుమధ్య గరుకు సిమెంటు తగిలింది.

డిటెక్టివ్ శిరీష్ పొడవుపాటి చువ్వ సంపాదించి సిమెంటును దొలిచాడు. సీలింగులో పొడవుపాటి సన్నటి రంధ్రం ప్రత్యక్షమయింది. సన్నపాటి ట్వాయిన్ దారాన్ని ఆ రంధ్రంలోకి జొనిపి ట్వాయిన్ దారంమీద నీళ్ళ చుక్కలు పోశాడు.

మాధవి క్రింద గదిలో వెళ్ళి చూచింది. నీళ్ళచుక్క తలగడమీద పడింది.

"నాన్నగారి మొహం మీద ఈ రకంగా సోడియం సైనెడ్ వేసి హత్య చేసింది అత్తయ్య!" అరిచింది మాధవి.

"అవును. ఈ దారం మొహంవరకు దింపి ఖచ్చితంగా పెదిమలమధ్య సైనెడ్ ద్రవం పడేలాగా చేయాలనుకుంది. అయితే నాన్నగారు నిద్రలో అటు యిటు కదిలి వుంటారు. అందుకే ద్రవం పెదిమల మధ్య కాకుండా ఆయన కనుకొలకుల్లో పడింది. మూసిన గదితలుపుల మధ్య పకడ్బందీగా హత్య సృష్టించగలిగింది."

మాధవి రోదిస్తోంది.

అప్పుడే పోర్టికోలో ఆటోరిక్షా ఆగిన చప్పుడయింది. డిటెక్టివ్ శిరీష్ చెవులొరగా పెట్టి వినసాగాడు. ఆటో తిరిగి బయలుదేరింది. ఆటో దిగిన వాళ్ళెవరూ లోపలకు రాలేదు.

డిటెక్టివ్ శిరీష్ చటుక్కున మెట్లు దిగి బయటకు పరుగెత్తాడు. ఆటో రోడ్డుమీద చాల దూరం పోయింది. డాట్సన్ కారులో డిటెక్టివ్ దాన్ని వెంబడించాడు.

10

ఆటో శ్రీనివాసా లాడ్జిముందు ఆగింది.

రమేష్ ఆటోలోంచి దూకి లాడ్జిలోకి పరుగెత్తాడు. డిటెక్టివ్ శరీఫ్ కారాపి దిగాడు. కౌంటర్ దాటి నడవలోకి పరుగెత్తాడు. మలుపులో అడుగుల చప్పుడు వినిపిస్తోంది. మలుపు తిరగబోయాడు డిటెక్టివ్.

ఫట్ మంది.

డిటెక్టివ్ తల పట్టుకొని అలాగే కూలబడిపోయాడు. తలలో వేలాది సూదులు దింపుతున్నట్టుగా బాధాకరమైన అనుభూతికి లోనయ్యాడు. అలాగే అతికష్టంమీద కళ్ళు తెరచి చూడసాగాడు.

నడవాలో అనసూయ నిలబడివుంది. ఆమె చేతిలో ఇనుపరాడ్ వుంది. మూర్తి ఆమె ప్రక్క నిలబడి వున్నాడు. అతడి చేతులు విరచి కట్టి వున్నాయి.

రమేష్ ఉత్సాహంగా డిటెక్టివ్‌ను సమీపించి ప్రక్కనే వున్న గదిలోకి యీడ్చాడు. తరువాత మూర్తిని అటు నడిపించాడు.

"అనసూయా! భీమరాజు నెందుకు చంపావు?" అడిగాడు డిటెక్టివ్.

రమేష్ తలుపు మూశాడు.

అనసూయ పిశాచంలాగా నవ్వింది. నోరు విప్పబోయి ఆగింది. కిటికీ రెక్క భళ్ళున తెరచుకుంది. డిటెక్టివ్ అటు చూశాడు.

జానీ! అతడి చేతిలో పిస్తోలు మిలమిలలాడింది.

"మూర్తీ!" అరిచాడు జానీ.

డిటెక్టివ్ నిర్ఘాంతపోయాడు. తీవ్రవాదంలో ఉన్న తమకంతోనో, గోపాలరావుగారి అస్థిమీద కన్నువేసో,

జానీ ఆరువేల మైళ్ళపాటు తననూ, మూర్తినీ వెంబడించుకు వచ్చాడు.

"మూర్తీ! నువు నన్ను వెన్నుపోటు పొడిచావు. నిన్నూ, నన్ను యింతదూరం వెనక్కు తీసుకు వచ్చిన డిటెక్టివ్‌ను వదిలిపెట్టను" ట్రిగ్గర్ నొక్కాడు జానీ.

మూర్తికి మోకాళ్ళ వెనుక ఎవరో తన్నినట్టయింది. కట్టె విరిగి పడ్డట్టుగా వెనక్కి పడ్డాడు. అతడిని భద్రంగా చేతులు అడ్డు పెట్టి పెట్టున్నాడు డిటెక్టివ్.

అనసూయ 'కెవ్వు'న అరచింది. బులెట్ ఆమె ఛాతీలో దిగబడింది. ఆమె నేలమీదకు దబ్బున పడింది. ఇనుపరాడ్ ఖంగున శబ్దంచేసి డిటెక్టివ్ వైపు దొర్లింది. రమేష్ తల్లిమీదపడి రోదించ సాగాడు.

జానీ తిరిగి పిస్తోలు ప్రేల్చాడు. బులెట్ గచ్చుమీద తగిలి ఖంగుమని పైకి రిఫ్లెక్టు అయి సీలింగులో ప్రవేశించింది. డిటెక్టివ్ యినపరాడ్ అందుకున్నాడు. జానీ వైపు దాన్ని విసిరాడు. రాడ్ కిటికీ చువ్వకు బలంగా తగిలింది. జానీ అది తనను తాకుతోందని భ్రమించాడు. చెయ్యి చటుక్కున లాక్కున్నాడు. పిస్తోలు లోపలి ప్రక్కకు జారిపోయింది.

, జానీ పిస్తోలు అందుకోబోయాడు డిటెక్టివ్ ఒక్క వురుకులో కిటికీని సమీపించి అతడి చెయ్యి దొరకబుచ్చుకున్నాడు. బలంగా ముందుకు లాగిపెట్టి జుత్తు అందుకున్నాడు.

తలలో సూదులు దబ్బనాల్లాగా అయి మరీ పోటు పెడుతున్నాయి. అయినా జానీ జుత్తును పట్టుకుని కిటికీ చువ్వలకు శక్తికొద్దీ తాకించి కొడుతున్నాడు. జానీ కాళ్ళు గిలగిలలాడి గచ్చు మీద జారిపోతున్నాయి.

అయినా, డిటెక్టివ్ జాలి చూపించదల్చుకోలేదు.

గది తలుపులు ఎవరో కొడుతున్నారు. రమేష్ తలుపు తెరిచాడు. పోలీసులు లోపలకు వచ్చారు.

జానీ నిస్త్రాణగా కిటికీకి చేరగిల పడిపోయాడు.

ఇన్‌స్పెక్టర్ కుమార్ వంగి అనసూయ నాడి పట్టుకున్నాడు.

* * *

"భీమరాజు నన్ను చేరదీశాడు. నాలో యింకా తీరని కోరికలకు అతడు ఆజ్యం పోశాడు. మధ్యలో ఏమనుకున్నాడో మాధవి గురించి నన్ను ప్రశ్నలు వేసేవాడు. క్రమంగా ఆమెమీద మోజు పెంచుకోసాగాడు. గోపాలరావు అన్నయ్య అతడితో క్లబ్బులో ఘర్షణ పడ్డాడు. నేను భీమరాజును వదిలించుకుంటే నేగాని మాధవికి నా కొడుకును భర్తగా చేయలేను. గోపాలరావన్నయ్య అతడితో ఆ రాత్రి నా గురించి భీమరాజును అడిగి మా రహస్య జీవితం గురించి తెలుసుకుంటాడని గ్రహించాను. నేను నా కొడుకుతో కలసి భీమరాజును చంపి యింటి తలుపులు తెరచి తిరిగి వచ్చేశాం.

సోడియం సైనెడ్ సంపాదించి అన్నయ్యను చంపేశాం. మాధవి భర్త ఇక రాడనీ, మాధవి ఒంటరిగా తై అయి రమేష్‌ను వరించక తప్పదని నేనే అన్నయ్యను హత్యచేశాను" అంది అనసూయ.

ఇన్‌స్పెక్టర్ కుమార్, ఆమెనుండి మరణ వాఙ్మూలం తీసుకున్నాడు.

రమేష్ తన కథనంలో ఒక విషయం చెప్పాడు.

అతడు అంతకు క్రితం వారమే 'థండర్ బాల్' చిత్రం చూశాడు. జేమ్స్‌బాండ్‌ను పై అటకమీదనుం-

దారంద్వారా విషంపంపి చంపాలని ప్రయత్నించుతారు. ఆ పథకం మేనమామమీద ప్రయోగించాలనిపించింది రమేష్‌కి. తల్లికి హాత్యా పథకం చెప్పాడు.

"మీ ఫీజు చెల్లిస్తాను" అన్నది మాధవి.

డిటెక్టివ్ శిరీష్ ఆమెవైపు నవ్వుతూ చూశాడు.

"మీ యిద్దరూ ఏ ఒడిదుడుకులు లేకుండా సుఖంగా సంసారం చేయండి" అన్నాడు శిరీష్ ఆమె భర్తను ఓరకంట చూచి.

—:అయిపోయింది:—